క్లుప్తంగా

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జియ్యాని శ్రీధర్


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: నగరపాలక సంస్థ కమిషనర్ సంపత్ కుమార్‌ను బుధవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక సంస్థలో అనేక అభివృద్ధి పనులు పూర్తికావాలని ఆకాంక్షించారు.

విస్తృతంగా వాహన తనిఖీలు


మల్కాపురం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మల్కాపురం: నూతన సంవత్సర వేడుకలు శృతి మించికుండా పోలీసులు కట్టడి చేశారు. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకూ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మల్కాపురం స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. మల్కాపురం,శ్రీహరిపురం,కోరమాండల్ కూడళ్లలో వాహనాలను ఆపి పత్రాలు పరిశీలించారు. ట్రిపుల్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు.

పోర్ట్ చైర్మన్‌ను కలిసిన యూనియన్ సభ్యులు


పోర్టు చైర్మన్ అంగముత్తుకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న యూనియన్ నాయకులు

కంచరపాలెం: పోర్ట్ చైర్మన్ అంగముత్తును నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు నేతృత్వంలో పోర్ట్ యూనియన్ ఆఫీస్ బేరర్స్ బుధవారం విశాఖ పోర్ట్ చైర్మన్ డాక్టర్ అంగ ముత్తును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ నాయకులు గురుప్రసాద్, వెంకటరావు, అప్పలనాయుడు, మంజుల, శాంతి, అప్పారావు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ నూతన కమిటీ


మహిళా వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

మురళీనగర్ : మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం బుధవారం కొలువు తీరింది. ఈస్ట్ పార్కులోని అబ్దుల్ కలాం కళావేదికలో నూతన అధ్యక్షురాలు కె.మాధవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల వివరాలు ప్రకటించారు. 2025 సంవత్సరంలో నిర్వహించాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షురాలు సీహెచ్.వరలక్ష్మి, కార్యదర్శి పి.కమల, సంయుక్త కార్యదర్శి ఎ.రాధ, కోశాధికారి ఎం.శేషామణి, సంయుక్త కోశాధికారి లీలానాయుడు, జాలీ వాకర్స్ ఎస్.కృష్ణవేణి, కె.సుగుణ, డైరెక్టర్లు సుశీల హిమబిందు, ఎం.మహాలక్ష్మి, జి.మహాలక్ష్మి, ఎస్.పూర్ణిమ, ఎ.మాధవీలత, లక్ష్మీకుమారి, తులసీ ప్రభ, డి.రాణి, శోభ, సుమలత, సలహాదారులు ఎస్.లలితారెడ్డి, డి.శిరీష పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్


వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గోపాలపట్నం: నూతన సంవత్సర వేడుకలు ఊరూవాడా అట్టహాసంగా నిర్వహించారు.మంగళవారం రాత్రి 12 గంటలకు యువకులు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొడుతూ కేకులు కట్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని ఎంజాయ్ చేశారు.

ప్రత్యేక పూజలు, ప్రార్థనలు

నూతన సంవత్సరం కావడంతో బుధవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతా హాయిగా ఉండాలని ఆకాంక్షించారు. జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాష్ నగర్ ఎరుసలేమ్ చర్చిలో ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి సిస్టర్ పీస్ ఏంజెల్ బ్లెస్సీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

యునైటెడ్ క్రైస్ట్‌చర్చిలో ....

కొత్తపాలెం యునైటెడ్ క్రైస్ట్‌చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. సంఘ కాపరులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

మల్కాపురం: నూతన సంవత్సరం వేడుకలు పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి అట్టహాసంగా నిర్వహించారు. యువత హ్యాపీ న్యూయర్ అంటు కేక్‌లు కట్ చేసి తినిపించుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొత్త సంవత్సరం మొదటి రోజు దైవ దర్శనం చేసుకుంటే అంతా మంచి జరుగుతుందన్న నమ్మకం బుధవారం ఆలయాలకు క్యూ కట్టారు. ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు, అధికారులు, ఆత్మీయులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. షిప్‌యార్డు జీఎంను కార్మిక సంఘాల నేతలు కలిశారు.

- జీవీఎంసీ 60,61,62,40వ వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్,కొణతాల సుధ,బల్లా లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు తదితరులు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌ను కలిసి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

సేవా కార్యక్రమాలు

మల్కాపురం: కొత్త సంవత్సరం వేళ 59వ వార్డు హిమాచల్‌నగర్ ప్రాంతానికి చెందిన లలిత మహిళా మండలి ప్రతినిధులు వినూత్నంగా ఆలోచించారు. ఆడంబరాలకు పోకుండా నూకాంబిక ఆలయం వద్ద పలువురికి రగ్గుల పంపిణీ చేశారు. తొలుత స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

- 61వ వార్డు మల్కాపురం పల్లివీధికి చెందిన సన్నీ ట్రస్టు నిర్వాహకుడు డొక్కాడ సన్యాసిరావు కుటుంబ సభ్యులు పేదలు, వృద్ధులకు అల్పాహారం అందించారు.


దుర్గాగణపతి ఆలయంలో బారులు తీరిన భక్తులు


వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావును సత్కరిస్తున్న శానిటరీ సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ సేవియర్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ లంకపల్లి జాకబ్ రాజు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పెర్సి, కె.వి.హీరమ్స్ నూతన సంవత్సర సందేశాన్ని అందించారు. ముందుగా యువతీ, యువకులు ప్రత్యేక గీతాలు, బైబిల్ పఠనం చేశారు. అనంతరం కేక్ కటింగ్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ నేతల శేఖర్, పీసీసీ సభ్యులు కె. జాన్ సుధాకర్, పి. రాజ కుమార్,కుండ విజయ్ కుమార్, జి. షాలేమ్ రాజు ,కోనాల కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ కార్యాలయంలో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు శానిటరీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ లక్ష్మణరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, మేస్త్రీలు రమణ, గోవింద్ పాల్గొన్నారు.


ఎరుసలేమ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సంఘకాపరి ఏంజెల్ బ్లెస్సీ


కొత్తపాలెం యునైటెడ్ చర్చిలో న్యూఇయర్ వేడుకల్లో పాల్గొన్న విప్ గణబాబు


షిప్‌యార్డ్ జీఎంను కలిసిన అధికారులు


రగ్గులు అందజేసిన లలిత మహిళా మండలి సభ్యులు

వైఎస్సార్‌టీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ


వైఎస్సార్‌టీయూసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందిస్తున్న నూకరాజు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ కార్యాలయంలో బుధవారం సీనియర్ నాయకుడు, సూపర్‌వైజర్ నూకరాజు చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల..

సింధియా: షిప్‌యార్డ్ అగ్నికుల క్షత్రియ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యురాలు అంగ దుర్గాప్రశాంతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ అగ్నికుల క్షత్రియ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కీలు గణేష్, ప్రధాన కార్యదర్శి ప్రసంగి రామచంద్రరాజు, కోశాధికారి యర్ర శ్రీనివాసరావు, అంగ శ్రీను, కర్రి తాతారావు, సమ్మిడి రమణ, తెప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా పరిషత్ కార్యవర్గ ఎన్నిక


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత చిత్రకళా పరిషత్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. 61వ వార్డు మల్కాపురం శాఖా గ్రంథాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో చిత్రకళా పరిషత్ అధ్యక్షుడిగా డి.త్యాగరాజు,ఉపాధ్యక్షులుగా బి.మోహన్‌రావు,టి.ప్రభాకరరావు ఆచారి, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాస్ మనోహర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా జి.రాజు,వి.శివసత్యనారాయణ,కోశాధికారిగా ఎస్.కోటేశ్వరరావు,ముఖ్య సలహాదారులుగా జి.కె.వి.రాజు తదితరులను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గాన్ని డాక్టర్ హేమలత, ప్రముఖ చిత్రకారుడు,రచయిత సుంకర చలపతిరావు అభినందించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

గ్రూప్ - 2 ఫలితాలు మళ్లీ విడుదల చేయాలి

సీతమ్మధార : గ్రూప్ - 2 ఫలితాలు మళ్లీ విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందించారు. మెయిన్స్ పరీక్షల కోసం అభ్యర్థులను మళ్లీ ఎంపిక చేయాలని కోరారు. అలాగే 2022 పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ రాత పరీక్షలో అనేక తప్పులు దొర్లాయని, వాటికి గ్రేస్ మార్కులు ఇచ్చి అభ్యర్థులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం యువతకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఆయనతో పాటు వాసుపల్లి రాంబాబు ఉన్నారు.

ఇది తగునా!

- పాఠశాలల చెంతన డంపర్‌బిన్లు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ఫోకస్


ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద అడ్డంగా డంపర్ బిన్.


ప్రహరీ వద్ద డంపర్ బిన్లు ఇలా....

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలల ప్రధాన గేటు వద్ద జీవీఎంసీ అధికారులు డంపర్ బిన్లు ఏర్పాటు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యా నిలయాలకు ఆనుకుని చెత్త వేసే బిన్లు పెట్టడం తగునా అని ప్రశ్నిస్తున్నారు. గేటుకు ఇరువైపులా దుకాణాలు ఉండడంతో విద్యార్థులు విరామసమయంలో అక్కడ చిరుతిళ్లు కొంటారు. ఆ సమయంలో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు డంపర్ బిన్లలో చెత్త నిండి రోడ్డుపై పడడంతో పశువుల సంచారం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఇబ్బందులు వాపోతున్నారు. డంపర్ బిన్ తొలగించాలని శానిటరీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి డంపర్ బిన్లు తొలగించాలని కోరుతున్నారు.

నూతన ఉత్సాహంతో లక్ష్యాలు సాధిద్దాం

షిప్‌యార్డు సీఎండీ హేమంత్‌ఖత్రి


కేక్ కట్ చేస్తున్న సీఎండీ హేమంత్‌ఖత్రి, ఇతర ఉద్యోగులు

సింధియా: నూతన ఉత్సాహంతో లక్ష్యాలు సాధించి సంస్థను అగ్రపథంలో నిలుపుదామని హిందూస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి పిలుపునిచ్చారు. సంస్థ ఆవరణలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఉద్యోగులు, వివిధ గుర్తింపు యూనియన్ ప్రతినిధులు, కార్మికుల నడుమ ఘనంగా నిర్వహించారు. వేడుకలకు షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి ముఖ్య అతిథిగా పాల్గొని హెచ్ఎస్ఎల్ డిజిటల్ క్యాలెండర్-2025ను ఆవిష్కరించి, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ మంత్రిత్వ శాఖ విజన్‌కు అనుగుణంగా భవిష్యత్తులో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి రంగాలపై దృష్టి సారిస్తూ సంస్థ ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, గుర్తింపు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'రిటైర్‌మెంట్ వయసు తగ్గింపు నిర్ణయం సరికాదు'

డాబాగార్డెన్స్: పదవీ విరమణ వయసు 62 నుంచి 60 ఏళ్లకు తగ్గించడం వల్ల కార్మికులు ఆవేదనకు గురవుతున్నారని, 62 ఏళ్ల వరకు కొనసాగించాలంటూ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు టి. నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తగ్గింపు సర్క్యులర్ కార్మికులకు పిడుగు లాంటి వార్తని, సర్క్యులర్ చూసి కార్మికులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. అదనపు కమిషనర్ విభాగంలో 8 మంది, యూసీడీలో 18, ఐటీలో ఇద్దరు, అగ్రికల్చర్‌లో ముగ్గురు, చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో 17 మంది, నీటి సరఫరా, యూజీడీ విభాగంలో 90 మంది, విద్యా విభాగంలో 28 మంది పదవీ విరమణ/చనిపోవడం కారణంగా ఆ ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. సిబ్బంది కొరతతో ఇప్పటికే పని భారం పెరిగిందని, దీనికి తోడు సుమారు 400 మంది వరకు కార్మికులను రిటైర్మెంట్ వార్త గందరగోళంలో పడేసిందన్నారు. ఇప్పటి వరకు 62 ఏళ్ల విధానాన్నే కొనసాగించాలని, లేనిచో రిటైర్ అయిన వారి వారసులకు, పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్/చనిపోయిన/అనారోగ్యం పాలైన వారి దరఖాస్తుల ప్రకారం రిక్రూట్‌మెంట్ చేసే వరకు కొనసాగించాలని కమిషనర్‌ను కోరారు. లేనిచో నీటి సరఫరాతో పాటు పారిశుధ్య కార్మికులు, ఇతర విభాగాల కార్మికులు సమ్మెలోకి వెళ్లడం తప్ప, మరో మార్గం లేదని ఆ వినతిలో పేర్కొన్నారు.

'అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'


నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

డాబాగార్డెన్స్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను విమర్శించినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడంపై సీపీఎం మండిపడింది. కమ్యూనిస్టుల పిలుపు మేరకు గత నెల 30 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు.. నిరసనలు చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పూర్ణా మార్కెట్‌లో ముఠా కళాసీ యూనియన్ నాయకుడు ఎం. సుబ్బారావు నేతృత్వంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకుడు చంద్రమౌళి మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసి యావత్ దేశ ప్రజలను ఆవేదనకు గురి చేశారని, అటువంటి వ్యక్తిపై ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు మన్మథరావు, పైడిరాజు, ఆర్. నాయుడు, నర్సింగరావు, మహేష్, నారాయణ, రమణ, సంజీవ్, సాంబ, శ్రీను, సూరి, పెద్ద ఎత్తున కళాసీలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్యం నాలుగు నెలలుగా ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. యాజమాన్యం వెంటనే పెండింగ్ ఉన్న 285 శాతం జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, బి.ఎన్. రాజు, సుబ్బయ్య, కారు రమణ, రమణమూర్తి, అవతారం, మద్ది అప్పలరాజురెడ్డి, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసం.. ఆధ్యాత్మిక వైభవం


భక్తులతో కిటకిటలాడుతున్న తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం

అక్కిరెడ్డిపాలెం: వెంకన్న ఆలయాలు ధనుర్మాస పూజలతో శోభిల్లుతున్నాయి. ప్రత్యేక పూజలతో నూతన శోభ సంతరించుకున్నాయి. జీవీఎంసీ 68వ వార్డులోని భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల దేవదాయ శాఖ నిర్వహణలోని వేంకటేశ్వర స్వామి, వినాయక స్వామి వార్ల దేవాలయం, 69వ వార్డు షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం రోజురోజుకూ భక్తుల తాకిడితో శోభాయమానంగా విరాజిల్లుతున్నాయి.

ప్రసన్న వేంకటేశ్వరాలయం విశిష్టత

భెల్ సిగ్నల్ పాయింట్ వద్దగల ప్రసన్న వేంకటేశ్వరాలయం విశాఖ నగరంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న ఆలయం. బీహెచ్‌పీవీ ఉద్యోగులు ఆ ప్రాంతంలోని ప్రసన్న గిరి ప్రసన్న వేంకటేశ్వరుడిని చినజీయర్ స్వామితో ప్రతిష్ఠింపజేశారు. అదే కొండపై బాల వినాయక స్వామి , దాసాంజనేయ స్వామి ఆలయాలను కూడా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రసన్న వేంకటేశ్వరుడు కోరిన కోరికలు తీర్చే స్వామిగా పేరు ప్రఖ్యాతలు పొందారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా 2002లో ఆలయాలను దేవదాయ శాఖ తమ ఆధీనంలో తీసుకుంది. ప్రతీ ఏటా ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తుతారు.

దివ్య వైభవం

షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం అనతి కాలంలోనే ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి సామాన్య రోజుల్లో కూడా భక్తులు పోటెత్తుతున్నారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రాన్ని ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ స్థాపించారు. అప్పటి నుంచి షీలానగర్‌కు ఆధ్యాత్మిక శోభ వచ్చింది. దివ్యక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులదే అగ్రస్థానం. ప్రతి శనివారం ఆలయంలో భక్తులకు అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నారు. ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహిస్తున్నారు.


ప్రసన్న వేంకటేశ్వరుడు


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న వేంకటేశ్వర ఆలయ ప్రవేశమార్గం

ప్రశాంతంగా ఉంటుంది



షీలానగర్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశుని దర్శనంతో ఎంతో ఆనందంగా ఉంటుంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న మాదిరిగానే ఆలయ ప్రవేశంతోనే అనుభూతి పొందుతాం. ఆలయంలో భక్తులకు నిత్యం ప్రసాద వితరణ చేయడం విశేషం.

– నంబారు రాజు, అక్కిరెడ్డిపాలెం

చిన్న తిరుపతిగా భావిస్తాం



భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయం అంటే చిన్న తిరుపతిగా భావిస్తాం. గాజువాకతో విశాఖ, అనకాపల్లి ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. కోరిక కోరికలు తీర్చే ప్రసన్న వేంకటేశ్వరునికి దేశ విదేశాల్లో భక్తులు ఉన్నారు. ఆలయం ప్రసన్న గిరిపై ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుంది.

– జనార్దన్, రాంనగర్

నీల్ అముండ్‌సన్ విగ్రహం ఏర్పాటు


నీల్ అముండ్‌సన్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ప్రసాద్, ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ఆధునిక కెమికల్ ఇంజినీరింగ్ పితామహుడు నీల్ అముండ్‌సన్ విగ్రహాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పూర్వ వీసీ పద్మశ్రీ జీడీ యాదవ్ ఆన్‌లైన్‌లో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్ సంయుక్తంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బీవీ లక్ష్మణరావు సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ వీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కెమికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్కరికీ నీల్ అముండ్‌సన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ యు.శ్రీదేవి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఆయిల్ టెక్నాలజీ ఇన్‌చార్జి హెడ్ డి.దామోదర్, పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ సీహెచ్ జయప్రకాషరెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.